క్లుప్తంగా

400 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చింతపల్లి: తాజంగిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కృష్ణాష్టమి సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. తాజంగి పంచాయతీ కేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి రోగులు ఈ వైద్య శిబిరానికి తరలివచ్చారు. ఈ శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు సుధాకర్ రెడ్డి, సూర్య, నాని, నాగరాజు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామస్తులు పూజారి మోశ్యా తదితరులు పాల్గొన్నారు.

29న మండల సమావేశం

ఎటపాక: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 29న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బాపన్నదొర సోమవారం తెలిపారు. ఎంపీపీ కాక కామేశ్వరి అధ్యక్షతన గురువారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ హాల్‌లో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు సత్కారం



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సత్కరిస్తున్న ఎంపీపీ బోయినకుమారి, నేతలు

గూడెంకొత్తవీధి: రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును సోమవారం పాడేరులో జీకే వీధి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయనను సత్కరించారు. ఎంపీపీ బోయినకుమారి, నాయకులు కృష్ణారావు, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామపెద్దలు

అడ్డతీగల: విశ్వమాత మదర్ థెరిసా జయంతి వేడుకలను అడ్డతీగలలో స్థానికులు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక సాక్షి స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థ డైరెక్టర్ ఆరోగ్యరాజు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్న థెరిసా విగ్రహాన్ని ఏర్పాటుచేసి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విగ్రహదాత జి.సురేష్ మాట్లాడుతూ స్థానికంగా గడిచిన కొన్నేళ్లుగా మదర్ థెరిసా జయంతి వేడుకలు క్రమం తప్పకుండా జరిపిస్తున్నామన్నారు. ఆమె భారతదేశంలో చేసిన సేవలను కొనియాడారు. గ్రామస్తులు సత్తిబాబు, శ్రీను, జయరాం, రమేష్, సాయి, శ్యామ్, బాబి, శివ, శ్రీను, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండకర్లలో లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం కొండకర్ల వద్ద సోమవారం లారీ బోల్తా పడింది. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపునకు లోడుతో ఓ లారీ వెళ్తుంది. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో లారీ బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

వైద్యులకు రక్షణ కరువు



వైద్యులకు రక్షణ కరువైంది, ప్రతి ఆస్పత్రిలో వైద్యులపై తరచూ దాడులు జరుగుతూనే ఉన్నాయి. వీటి నిలుపుదలకు పాలకులు ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలి. ప్రజల ప్రాణాలను వైద్యులు రక్షిస్తుంటే వారిపైనే హింసకాండ సృష్టిస్తున్నారు. విధులు నిర్వహించాలంటేనే భయం అనిపిస్తుంది, ఏ సమయంలో ఏం జరుతుందో తెలియని పరిస్థితి. ప్రతి ఆస్పత్రిలో పోలీస్ రక్షణ కల్పించాలి.దీంతో వైద్యులకు ప్రత్యేకమైన భద్రత ఉంటుంది. **–ధరణి**, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అరకులోయ

– అరకులోయ (రూరల్)

చట్టాలు కఠినంగా అమలుచేయాలి



వైద్యులు, సిబ్బంది పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలి. సక్రమైన చట్టాలు అమలుచేయక వైద్యాధికారులపై దాడులు పెరుగుతున్నాయి. వైద్యులపై తరచూ దాడులు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రిళ్లు ఆస్పత్రుల్లో రోగుల కోసం వస్తున్న వారిలో కొంతమంది మద్యం సేవించి ఉండడం, వైద్యులు, సిబ్బందితో చిన్న విషయాలపై గొడవలు చేస్తున్నారు. ఇలాంటివి జరగకుండా ఆస్పత్రుల్లో పోలీసు రక్షణ ఉండేలా చూడాలి. **–డాక్టర్ నాగరాజు**, ఏరియా ఆస్పత్రి, అరకులోయ

– అరకులోయ (రూరల్)

కృష్ణా.. ముకుందా మురారీ



తాంగులగుడ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలు

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు
- చిన్నికృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారుల సందడి
- ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న యువత



శోభయాత్రలో కోలాటం

అరకులోయ రూరల్/జి.మాడుగుల/రాజవొమ్మంగి/ఎటపాక/కూనవరం: జిల్లా వ్యాప్తంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఇళ్లను రంగవల్లులు, పూలదండలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. ఇంటి వాకిట నుంచి లోపల వరకు కృష్ణుని పాద ముద్రల అచ్చు వేసి.. ఆ భవంతుని ఆహ్వానిస్తు పాటలు పాడారు. కృష్ణ భగవానునికి దీపదూపాలతో పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. పూజలు చేసేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. చిన్నికృష్ణ, రాధ, సత్యభామ, గోపిక వేషధారణలో చిన్నారులు అలరించారు. వారి బుడిబుడి అడుగులతో తమ ఇళ్లలోకి చిన్నారులను ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో చిన్నారులు సందడి చేశారు. గ్రామాల్లో సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. రంగునీళ్లు చల్లుతుంటే యువకులు ఉట్టి కొట్టేందుకు యువత పోటీ పడ్డారు. థింసా నృత్యాలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. కృష్ణుని విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.



కూనవరం, వై.రామవరంలలో ఉట్ల సంబరాల్లో యువత



రాజవొమ్మంగిలోని శ్రీకృష్ణుని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అడ్డతీగల పవనగిరి క్షేత్రంలో శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న వెంకట్రామయ్య స్వామిజీ

ముంచంగిపుట్టు: మండలంలోని కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంప్‌లో సీఆర్‌పీఎఫ్ పోలీసులు కృష్ణాష్టమిని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కొయ్యూరు: మండలంలోని సింగవరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ మల్లిబాబు చెందిన ఆధ్వర్యంలో వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవంతో పాటు కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. శోభయాత్రను సింగవరం ఆలయం నుంచి రాజేంద్రపాలెం వరకు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం అందరిని ఆకర్షించింది.



చిన్నికృష్ణుడు, సత్యభామ వేషధారణలో చిన్నారులు

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రంలో సోమవారం శ్రీకృష్ణజన్మాష్టమి పర్వదినం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. పవనగిరి స్వామిజీ తణుకు వెంకట్రామయ్య భక్తులచే పూజలు చేయించారు. పరిసరల గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పవనగిరిపై భక్తులతో సందడి నెలకొంది.

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణతో విద్యార్థులు అందరికీ కనువిందు చేసారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు, అతిథులకు రకరకాల ప్రత్యేక పిండి వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్ని కృష్ణుని వేషధారణలో చిన్నారులు



సింగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందు పరిషత్ నేతలు



పౌరాణిక పాత్ర వేషధారణలో యువత



కుజ్జెలి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి

- గోతులమయంగా జీకే వీధి- సీలేరు రహదారి
- గోతుల్లో పడి వాహనచోదకులకు గాయాలు
- పెరుగుతున్న ప్రమాదాలు
- నిత్యం తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



గూడెంకొత్తవీధి- ఆర్.వి.నగర్ మధ్య ప్రధాన రహదారి (ఫైల్)



ఇరుకురోడ్డులో రాకపోకలకు వాహనాల ఇబ్బందులు

గూడెంకొత్తవీధి: పేరుకే అది అంతర్రాష్ట్ర రహదారి అయినా కనీసం కచ్చా దారి కంటే దారుణంగా తలపిస్తోంది. అడుగడుగునా గోతులు.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మరింత దయనీయంగా మారింది. గూడెంకొత్తవీధి నుంచి సీలేరుకు మధ్య సుమారు 50 కిలోమీటర్ల ప్రయాణం ఉన్న రహదారిలో ప్రయాణికులు, వాహనచోదకులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రం నుంచి తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వెళ్లేందుకు ఒకే ఒక మార్గం ఉంది. అది నర్సీపట్నం నుంచి చింతపల్లి, గూడెంకొత్తవీధి సీలేరు మీదుగా వెళ్తుంది. పేరుకు అంతర్రాష్ట్ర రహదారి అయినా మూడు రాష్ట్రాలకు కలిపే ఈ రహదారిపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. రహదారి విస్తరణ మాట అటుంచితే కనీసం గోతులను కూడా పూడ్చడం లేదు. దీంతో ఈ మార్గంలో మూడు రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గూడెంకొత్తవీధి మండలం ఆర్.వి.నగర్‌నుంచి కొత్తవీధి, పాత వీధి, కొత్తపల్లి, లంకపాకలు, సప్పర్ల, రెయిన్‌గేజ్, దారకొండ ప్రాంతాల్లో రహదారి పూర్తిగా ఛిద్రమైంది. అడుగు అడుగుకు పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ గోతుల్లో వర్షపునీరు చేరడంతో మరింత ఇబ్బందిగా మారుతోంది. ఈ మార్గంలో గోతుల్లో పడి వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని చోట్ల రహదారి రూపురేఖలే మారిపోయాయి. ఇరుకురోడ్డులో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మార్గంలో తరచూ వాహనాలు నిలిచిపోయి గంటల కొద్దీ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారికి మరమ్మతు చేయాలని, గోతులు పూడ్చాలని వాహనచోదకులు, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ఇబ్బందులు



గూడెంకొత్తవీధి మండలంలోని ఆర్.వి.నగర్ నుంచి దారకొండ వరకూ రహదారి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలకు నిత్యం నరకం చూడాల్సి వస్తోంది. ద్విచక్రవాహనాలు పాడవుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని ఈ మార్గంలో కనీసం గోతలను అయినా పూడ్చితే కొంతవరకూ ఉపశమనంగా ఉంటుంది.

– **చిలకల బాలకృష్ణ**, పనసపల్లి

ప్రతిపాదనలు నివేదించాం

గూడెంకొత్తవీధి నుంచి సీలేరు వెళ్లే ప్రధాన రహదారికి గతంలో గిరిజన ఉపప్రణాళిక నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు బిల్లుల విషయంపై న్యాయస్థానానికి వెళ్లడంతో ఆ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఇబ్బంది లేకుండా ఉపాధి హామీ పథకంలో రహదారి మరమ్మతు పనులు, నిర్మాణానికి వీలుగా రూ.14కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు రూపొందించి కలెక్టర్‌కు నివేదించాం. అనుమతులు వస్తే ఉపాధి నిధులతో ఈ రహదారి పనులు చేపడతాం.

– **భరత్** ఆర్అండ్‌బీ జేఈ సీలేరు

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



వై.రామవరంలో అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి

వై.రామవరం: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఐ బి.నరసింహమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం జరిగిన వారపు సంతలో గిరిజనులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలు సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించొద్దన్నారు. జూదం, కోడిపందాలు జోలికి వెళ్లొద్దన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామల్లో గంజాయి అక్రమ రవాణా, కోడిపందాలు, జూదం వంటి సంఘటనలు జరిగితే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఏ సమస్య ఉన్న నేరుగా పోలీసు స్టేషన్‌కు వచ్చి తెలియపరిస్తే తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధిలో తాము పాలుపంచుకుంటున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా యువతను క్రీడల్లో ప్రాత్సహించేందుకు క్రికెట్, వాలీబాల్ వంటి పోటీలు నిర్వహిస్తున్నామని, క్రీడా సామగ్రి అందజేస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు పోలీసు శాఖ తరఫున అనేకప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించామన్నారు. శివారు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిం చామన్నారు. పోలీసు శాఖ సేవలను సద్వినియోగం చేసుకుని ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలలని సీఐ నరసింహమూర్తి కోరారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



మొత్తి భౌతికదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు

అరకులోయ రూరల్: మండలంలో లోతేరు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పట్టాసి మొత్తి(60) సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పార్టీ శ్రేణులతో కలిసి గ్రామానికి వెళ్లారు. మొత్తి భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు శెట్టి వెంకటరావు, సుందర్‌రావు, శ్రీరాం, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనకు వితరణ

మునగపాక(అచ్యుతాపురం): మల్లవరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నమరాజు రవీంద్రరాజు రూ.10వేలు విరాళం అందజేశారు. అన్నసమారాధనకు తనవంతు సాయంగా శ్రీకృష్ణ యాదవ సంఘ సభ్యులకు ఈ విరాళం అందించారు. కృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు సింహగిరిపై కృష్ణాష్టమి

- సాయంత్రం 6 వరకే దర్శనాలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమిని వైభవంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. రాత్రి శ్రీకృష్ణ జననోద్ధారణ పూజలు, బాలకృష్ణుడికి బేడా తిరువీధి నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల వరకే స్వామివారి దర్శనాలు భక్తులకు లభిస్తాయని పేర్కొన్నారు. ఆరాధన టిక్కెట్లు రద్దు చేసినట్లు వెల్లడించారు. నిత్యం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉండే రాజభోగం బ్రేక్ మంగళవారం ఉండదని, ఆ సమయంలో కూడా భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు సింహగిరిపై ఉట్ల సంబరం ఉంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఔదార్యం

హుకుంపేట: మండల కేంద్రంలోని ఓ అనాథ శవానికి అంత్యక్రియలు జరిపి స్థానిక యువకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనార్ తెడబారికి సురేష్‌కుమార్ తదితరులు మానవత్వం చాటుకున్నారు.

గత కొద్ది రోజులుగా మండల కేంద్రంలో యాచన చేస్తూ రోడ్డుమీద ఉంటున్న ఓ అనాథ వృద్ధురాలు సోమవారం సాయంత్రం మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక యువకులు, వార్డు సభ్యులు వెంకట్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియ జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్, తదితరులు ఆమె మృతదేహానికి అంత్యక్రియులు చేశారు. దీంతో స్థానికులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వాడ్రాపల్లిలో క్రీడా పోటీలు

మునగపాక: వాడ్రాపల్లిలో సోమవారం పలు ఆటల పోటీలు నిర్వహించారు. పెతకంశెట్టి జోగినాయుడు మా స్వారు గ్రంథాలయం వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పోటీలను వ్యాపారవేత్త కొయిలాడ దశావతారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.